సాక్షి మెదక్

సోమవారం ၊ 24 ၊ ఫిబ్రవరి ၊ 2025



జామ తోట.. సిరుల పూదోట

జామతోటల పెంపకంతో రైతులకు ఖర్చు తక్కువ. ఆదాయం ఎక్కువగా వస్తుండటంతో జామ తోటల వైపు మక్కువ చూపారు.

వివరాలు 8లో ▸



తీరని సొంతింటి కల

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపట్టిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల పథకం అస్త వ్యస్తంగా తయారైంది.

వివరాలు 8లో ▸

నేడు హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి

మెదక్ కలెక్టరేట్: నేడు హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి నిర్వహిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధులు కేటాయించడంతో జిల్లా అధికారులు అందుబాటులో ఉండరని, అందుకే హెల్ప్‌డెస్క్ ద్వారా ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు హెల్ప్‌డెస్క్ ద్వారా వినతులు సమర్పించాలని వివరించారు.

న్యూస్‌రీల్

బీజేపీతోనే అభివృద్ధి



ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించిన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓటు వేసి ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంతో పాటు నర్సంపల్లి గ్రామంలో గ్రాడ్యుయేట్స్‌ను కలిసి అంజిరెడ్డికి ఓటు వేయాలని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు లింగారెడ్డి, పట్టణాధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతాం

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



సమావేశానికి హాజరైన నాయకులు

మెదక్ కలెక్టరేట్: మాల మాదిగలను విడగొట్టి అశాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటేసిన మాలలను బొందపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేపటారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీ ఆమోదం అనేది మోసపూరితమన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా వర్గీకరణ జరుగుతుందని ఆరోపించారు. మాలలు సైనికుల్లా ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, వెన్నరాజు, సత్యనారాయణ, పొలిట్‌బ్యూరో చైర్మన్ శ్రీరాములు, జైభీమ్ సైనిక్ దళ కన్వీనర్ ఆసాది పురుషోత్తం, శివ, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్, యాదగిరి, శ్రీకాంత్, చంద్రయ్య, సిద్దిరాంలు, బాబు, కిశోర్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల గొంతుకగా పనిచేస్తా



మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌రెడ్డి

మెదక్‌జోన్: ఉపాధ్యాయులు ఆశీర్వదించి శాసనమండలికి పంపిస్తే వారి గొంతుకగా పనిచేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మామిడి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తే మూడోస్థానంలో నిలిచానని, ఈసారి ఆశీర్వదించాలని కోరారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఆరు నెలల్లో మహిళా టీచర్లకు ఫ్రీగా ఎలక్ట్రిక్ వెహికిల్స్ అందజేస్తానని స్పష్టం చేశారు. కార్పొరేట్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ప్రధాన పార్టీల అభ్యర్థులుగా బరిలో నిలుస్తున్నారని, వారికి ఓటేస్తే ఫోన్ కూడా ఎత్తే పరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, టీచర్ల ఇబ్బందులు కార్పొరేట్ శక్తులకు తెలియవన్నారు. సీపీఎస్ సాధన కోసం తన టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశానని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా గురుకులాల్లో పనిచేసే టీచర్లకు రెండో శనివారం, ఆదివారం సాధారణ సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే టీచర్లకు ఏం చేస్తానో బాండ్ పేపర్ రాసిస్తున్నట్లు తెలిపారు. టీచర్లకు పోస్ట్ ద్వారా బాండ్ పేపర్లు పంపానని తెలిపారు. ఈ సమావేశంలో ప్రతినిధులు నవీన్, సాయిచరణ్ తదితరులు ఉన్నారు.

ఏడుపాయల జాతరకు ప్రత్యేక బస్సులు



జహీరాబాద్ టౌన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఏడుపాయల జాతరకు ఈ నెల 25 నుంచి 28 వరకు ప్రతీ 30 నిమిషాలకొక ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అదేవిధంగా శ్రీకేతికీ సంగమేశ్వర ఆలయం వెళ్లే భక్తుల కోసం కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి ప్రతీ 15 నిమిషాలకు ఓ బస్సు జహీరాబాద్ నుంచి ఝరాసంగంకు బయల్దేరుతుందని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వన దుర్గమ్మా.. చల్లంగ చూడమ్మా

వన దుర్గమ్మా మము దీవించు తల్లీ అంటూ వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దుర్గమ్మను దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ అమ్మవారికి అర్చన చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు.

– పాపన్నపేట(మెదక్)



దుర్గమ్మ అమ్మవారు



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ప్రశాంతంగా 'గురుకుల' ప్రవేశ పరీక్ష



మెదక్‌జోన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాల ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 12 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు గంటల పాటు సాగింది. 3,934 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 3,833 మంది హాజరయ్యారు. పరీక్షలకు 97.57 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రెండు రోజుల్లో జాతర.. నిధులేవీ..?

'ఏడుపాయల'పై ఎన్నికల కోడ్ నీడలు

- ఏర్పాట్లు అంతంతమాత్రమే
- దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించేదెవరు.?
- అధికారులకు సవాల్‌గా మారిన నిర్వహణ

ఏడుపాయల జాతరపై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నీడలు కమ్ముకున్నాయి. ఈనెల 26వ తేదీ నుంచి జరిగే మహా జాతరలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కరువైంది. నోటిఫికేషన్ విడుదలైనా.. ఆలయ పాలక మండలి ఏర్పాటు చేయకపోవడంతో జాతర నిర్వహణ భారమంతా అధికారులపైనే పడింది. ఇన్‌చార్జి ఈవో అరకొర సిబ్బందితో ఇబ్బంది పడుతున్న వేళ.. ఈ మహా జాతర నిర్వహణ సవాల్‌గా మారింది. మరో రెండు రోజుల్లో జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఇప్పటి వరకు జాతర ఏర్పాట్ల కోసం నిధులు విడుదల కాలేదు.



ఏడుపాయల ఆలయం



పేరుకు పోయిన ప్లాస్టిక్ చెత్తా చెదారం

పాపన్నపేట(మెదక్): తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల జాతర ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనుంది. ప్రతియేటా సుమారు 15 లక్షల వరకు భక్తులు హాజరవుతారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కరువైంది. ఇప్పటి వరకు కలెక్టర్ రాహుల్ రాజ్. అడిషనల్ కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో రెండు సార్లు సన్నాహక సమావేశం నిర్వహించారు. చివరగా 25న ఏడుపాయల్లో మరో సమావేశం నిర్వహించనున్నారు. పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం లేకపోవడంతో ,స్థానిక సమస్యలు ,పరిష్కార మార్గాలు, సూచనలు కరువయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి .తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రతి యేటా ఏడుపాయల జాతర ఏర్పాట్లకు రూ.2 కోట్లు విడుదల చేస్తున్నారు. ఈసారి ఇంత వరకు నిధులు విడుదల కాలేదు. అయినా ఎప్పటిలాగే పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏటా మహాశివరాత్రి రోజున ప్రభుత్వం తరపున మంత్రి, లేదా ఎమ్మెల్యే దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించి జాతర ప్రారంభిస్తారు. అయితే ఈసారి ఎవరు పట్టు వస్త్రాలు సమర్పిస్తారో ఇంత వరకు ఖరారు కాలేదు.

ఇన్‌చార్జి ఈవో, అరకొర సిబ్బంది

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల 6ఏ టెంపుల్‌గా గుర్తింపు పొందింది. రూ.10 కోట్లకు పైగా ఆదాయం ఉండటంతో డిప్యూటీ కమిషనర్ స్థాయి ఈవో ఇక్కడ ఉండాలి. కనీసం రెగ్యులర్ ఈవో కూడా లేరు. ఆగస్టులో ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ 9 మంది జూనియర్ అసిస్టెంట్‌లు ఉండే వారు. ప్రస్తుతం నలుగురు మాత్రమే పని చేస్తున్నారు. జాతర కోసం కొంత మంది సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపాల్సిందిగా కమిషనర్ కార్యాలయానికి ఈవో విజ్ఞప్తి చేయగా.. కొండగట్టు దేవస్థానంలో పనిచేసి జనవరిలో రిటైరైన వై.అంజయ్యను రెండేళ్ల కోసం, తాత్కాలిక ప్రాతిపదికన ఏడుపాయల్లో అసిస్టెంట్ ఈవోగా నియామకం చేస్తూ అడిషనల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా అతని నియామకం వివాదాస్పదం కావడంతో, విధుల్లో చేరకుండానే నిలిచి పోయినట్లు తెలిసింది.

ప్రారంభమైన ఏర్పాట్లు

ఏడుపాయల జాతర కోసం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మంజీరా నది చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాలు, తాత్కాలిక టాయిలెట్లు, ఆలయం ముందు క్యూలైన్లు నిర్మిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఏడుపాయలకు సింగూరు నుంచి 0.35 టీఎంసీ నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అయితే ఏడుపాయల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్, చెత్తా చెదారం పేరుకుపోయింది. దాన్ని వెంటనే తొలగించాల్సిన అవసరం ఉంది.

అద్దె భవనాలే దిక్కు!

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- అరకొర వసతుల మధ్య అధికారుల విధులు
- పోస్టుల భర్తీలోనూ అలసత్వం



మోడల్ హౌస్‌లో కొనసాగుతున్న అల్లాదుర్గం పోలీస్ సర్కిల్ కార్యాలయం

అల్లాదుర్గం(మెదక్): పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటివరకు సొంత భవనాలు నిర్మించలేదు. కనీసం స్థల పరిశీలన చేయలేదు. దీంతో అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే సరిపడా సిబ్బందిని సైతం నియమించలేదు. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ఇది అల్లాదుర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి.

2016లో అప్పటి ప్రభుత్వం పునర్విభజనలో భాగంగా జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో సంగారెడ్డి జిల్లాలో ఉన్న అల్లాదుర్గం మండలాన్ని మెదక్ జిల్లాలో కలిపింది. అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాలను కలిపి అల్లాదుర్గం సబ్‌డివిజన్‌గా ఏర్పాటు చేసింది. పంచాయతీరాజ్ సబ్ డివిజన్, పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఇరిగేషన్ సబ్ డివిజన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ఉద్యానవనం, పీఏసీఎస్ సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. అయితే అరకొర వసతుల మధ్య అద్దె ఇంటిలో ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించేందుకు సరిపడా హాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమావేశం నిర్వహించేందుకు కల్యాణ మండపం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే మూడేళ్లుగా ఇన్‌చార్జిలతోనే అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయం కొనసాగుతుంది. పంచాయతీరాజ్ సబ్‌డిజన్ కార్యాలయం ఐకేపీ కార్యాలయంలో కొనసాగుతుంది. సొంత భవనం కోసం ఎవరు కృషి చేయడం లేదు. ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రిటైర్ అయినా, ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. కార్యాలయంలో డీఈఈ, ఇద్దరు అటెండర్లు మాత్రమే ఉన్నారు. కార్యాలయ పరిధిలో నలుగురు ఏఈలకు ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్ కార్యాలయం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో చిన్న గదిలో కొనసాగుతుంది. ఈ కార్యాలయంలో అటెండర్, రికార్డు అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు లేరు. అల్లాదుర్గం పోలీస్ సర్కిల్ కార్యాలయం, హౌసింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌస్‌లో కొనసాగుతుంది. ఇరుకైన రెండు గదులలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో కార్యాలయంలో సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా 2017 జనవరి 16న అల్లాదుర్గంలో ప్రాథమిక వ్యవసాయ సర్కిల్, ఉద్యానవన కార్యాలయాలను అప్పటి ఎమ్మెల్యే బాబూమోహన్ ప్రారంభించారు. అప్పట్లో ఎంపీపీ కార్యాలయంలోని గదులలో కార్యాలయాలు కొనసాగించారు. రెండేళ్ల తర్వాత 161 జాతీయ రహదారి విస్తరణలో సగం కూల్చివేశారు. దీంతో ఈ కార్యాలయాలకు భవనాలు లేక ఎత్తివేశారు.

ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన కలెక్టర్

అల్లాదుర్గంలో బీసీ గురుకుల పాఠశాల, ఐటీఐ, ఐసీడీఎస్, ఫైర్‌స్టేషన్, పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాలకు స్థలాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జనవరి 23న స్థలాలను పరిశీలించారు. అయితే స్థలాలు కేటాయించిన ప్రభుత్వం భవన నిర్మాణాలకు నిధులు ఎప్పుడు మంజూరు చేస్తుందో, అవి ఎప్పుడు పూర్తవుతాయో వేచి చూడాల్సిందే.

'ఈ-బాహా సే' విద్యార్థులకు చేయూత

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్



ప్రథమ స్థానంలో నిలిచిన పూణె ఇంజనీరింగ్ విద్యార్థులు

నర్సాపూర్: మనదేశంలో యువత ప్రతిభకు తగ్గ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి చెప్పారు. స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో 20న ప్రారంభమైన ఈ-బాహ సే ఇండియా పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఈ-బాహ లాంటి కార్యక్రమాలు విద్యార్థులకు చేయూతనిస్తాయన్నారు. కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె మాట్లాడుతూ ఈ పోటీలలో 85 జట్లు నమోదు చేసుకున్నాయని, 44 జట్లు పోటీలలో చివరి దశకు చేరాయన్నారు. పోటీలలో పాల్గొన్న అయా కాలేజీల విద్యార్థులకు పలు విభాగాలలో బహుమతులు అందజేశారు. పూణెకు చెందిన పింప్రి చించ్వర్డ్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, భీమవరానికి చెందిన విష్ణు ఇంజనీరింగ్ కాలేజీ మహిళలు రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ జట్టు తృతీయస్థానాన్ని దక్కించుకుంది. కార్యక్రమంలో భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మార్కెటింగ్ డైరెక్టర్ సుఖ్మల్ జైన్, విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ఈ-బాహ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాల్‌రాజ్ సుబ్రమణ్యం, ఆటోమోటివ్ టెస్ట్ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రామనాథన్ పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారానికి బర్డ్‌ఫ్లూ దెబ్బ

- వెలవెలబోతున్న సెంటర్లు
- మటన్ దుకాణాల కిటకిట



చికెన్ దుకాణం

మెదక్ మున్సిపాలిటీ: బర్డ్ ఫ్లూతో చికెన్ వ్యాపారానికి బ్రేక్ పడగా, మటన్ దుకాణాలు, చేపల విక్రయాలు జోరందుకున్నాయి. ఇదే అదనుగా భావించిన మటన్, చేపల వ్యాపారులు అమాంతం ధరలు పెంచేశారు. సండే వచ్చిందంటే.. ముక్క లేనిదే ముద్ద దిగదు...చికెన్ ప్రియులకు బర్డ్ ఫ్లూతో కాస్త బ్రేక్ పడింది. ఆదివారమైతే చాలు నాన్ వెజ్ ప్రియులు చికెన్, మటన్, చేపల కొనుగోలు ఎగపడుతారు. అయితే చికెన్‌తో బర్డ్ ఫ్లూ సోకుతుందన్న ప్రచారం జోరుగా కొనసాగుతోంది. దీంతో చికెన్ కిలో రూ.200 నుంచి రూ.250 వరకు అమ్మేవారు. ప్రస్తుతం రూ.150లకు విక్రయిస్తున్న కొనేవారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. క్వింటాళ్ల కొద్ది అమ్మే చికెన్.. ప్రస్తుతం కిలోలలో మాత్రమే అమ్ముడుపోతుందని వ్యాపారులు తెలిపారు. ఇదే క్రమంలో మటన్ డిమాండ్ విపరీతంగా పెడిగింది. కిలో మటన్ ధర రూ.720 ఉన్న రేట్లను 850 వరకు విక్రయిస్తున్నారు.

చేపల అమ్మకాల జోరు

చేపల అమ్మకాల జోరు కూడా విపరీతంగా పెరిగింది. కిలో చేపలు బొచ్చ, రౌటలు రూ.150 నుంచి 200 వరకు ఉండేది. ప్రస్తుతం కిలో చేపలు రూ.250 నుంచి రూ.350ల వరకు బొచ్చలు విక్రయిస్తున్నారు. అలాగే కొర్రమీను కిలో రూ.600ల వరకు విక్రయిస్తున్నారు.

ఎమర్జెన్సీ భవనం... పనులేమో నత్తనడక

- రూ.23.75కోట్ల వ్యయంతో ఆస్పత్రి నూతన భవన నిర్మాణం
- గోడలు కట్టి.. కూల్చి.. మళ్లీ కట్టి...
- ఏడాదిన్నరగా ఇదే తంతు
- పట్టించుకోని అధికారులు... పర్యవేక్షణ లోపం



ఎమర్జెన్సీ ఆస్పత్రి భవనం

మెదక్‌జోన్: మెదక్ జిల్లాలోని పిల్లికోటాల్‌లోని మాతాశిశు ఆస్పత్రి (ఎంసీహెచ్) పక్కనే నిర్మిస్తోన్న ప్రత్యేక అత్యవసర సేవల (ఎమర్జెన్సీ) ఆస్పత్రి భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సరైన పనుల పట్ల ప్రణాళిక, పర్యవేక్షణ లేకపోవడం , నాణ్యతలేని పనులు, ఎక్కడా కానరాని అధికారుల పరిశీలనలతో ఈ భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. గోడలు కట్టి కూల్చివేసి మరోసారి గోడలు కట్టడం వంటి చేష్టలతో ఎమర్జెన్సీ భవన నిర్మాణ పనులు అభాసుపాలవుతున్నాయి. ప్రారంభించి ఏడాదిన్నర కావొస్తున్నా కనీసం సగం నిర్మాణ పనులు కూడా పూర్తి కాలేదంటే పనులు ఎంత నత్తనడకన సాగుతున్నాయో అవగతమవుతోంది.

తప్పనిసరి నిబంధనతో...

జిల్లాకు ఇప్పటికే వైద్య కళాశాల మంజూరు కావడంతో దానిని ప్రస్తుతం ఓ ప్రైవేటు భవనంలో కొనసాగిస్తున్నారు. అయితే ఆ కళాశాల పరిధిలో 500 పడకల ఆస్పత్రి తప్పనిసరిగా ఉండాలనే వైద్యవిధాన పరిషత్ నిబంధనతో ఎంసీహెచ్ పక్కనే రూ.23.75కోట్ల వ్యయంతో 100 పడకల ఎమర్జెన్సీ ఆస్పత్రి భవన నిర్మాణాన్ని తలపెట్టారు. ఇప్పటికే జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 120 పడకలు, ఎంసీహెచ్‌లో 100 పడకలున్న సంగతి తెలిసిందే. మరో 180 పడకల ఆస్పత్రి కోసం (మెడికల్) కళాశాల భవనంతోపాటు నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకోసం స్థలాన్ని సైతం పరిశీలించారు. కానీ ఇది టెండర్ దశలో ఉంది.

పర్యవేక్షణ ఏది?

మెడికల్ ఇంజనీర్ పర్యవేక్షణలో ఎమర్జెన్సీ ఆస్పత్రి భవన నిర్మాణాన్ని 2023 జూన్‌లో ప్రారంభించారు. నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా ఈ పనులను పర్యవేక్షించిన పాపాన లేదు. సరైన ప్రణాళిక లేకపోవడంతో గోడలు కట్టి కొంత పూర్తయ్యాక వాటిని కూల్చేస్తున్నారు. తిరిగి మళ్లీ అదే పద్ధతిలో గోడలు కడుతున్నారు. నాసిరకం ఇసుక, వాటర్ క్యూరింగ్ లేకపోవడంతో కట్టిన గోడలు ఎన్నేళ్లు మన్నిక ఉంటాయనే ఆందోళన లేకపోలేదు.

ప్రజాధనం వృథా..

ఎమర్జెన్సీ ఆస్పత్రి భవన నిర్మాణ పరిస్థితి రాజుల పైసా రాళ్లపాలు అన్న చందనా తయారైంది. కోట్లాది రూపాయలతో సాగుతున్న నిర్మాణపనుల్ని దగ్గరుండి పర్యవేక్షించాల్సి అధికారులు ఎక్కడా కానరావడంలేదు. నిర్మాణ పనులు ఆన్‌లైన్ టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మాత్రం మరో సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో పనుల్లో పూర్తిగా నాణ్యత లోపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారమంతా అధికారుల కనుసనల్లోనే జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఈ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత, వేగం పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సంపులో పడి వ్యక్తి మృతి


బిజూ ఖర్సెల్

జిన్నారం (పటాన్‌చెరు): సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బొల్లారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌ రెడ్డి కథనం ప్రకారం.. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ కాలనీలో నివాసముంటున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన బీజూ ఖర్సెల్‌ (22) పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌ పనిచేస్తుంటాడు. ప్రమాదవశాత్తు శనివారం రాత్రి తాను నివాసం ఉండే గది ముందు ఉన్న సంపులో పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుత్‌ షాక్‌తో..


నవీన్‌ కుమార్‌ మృతదేహం

కొల్చారం(నర్సాపూర్‌): ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌కు గురైన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని రంగంపేటలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం ప్రకారం.. హైదరాబాద్‌ ఉప్పుగూడకు చెందిన మొగుడంపల్లి నవీన్‌ కుమార్‌(45) ఓ అడ్వర్టైజ్‌మెంట్‌ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రంగంపేటలోని ఓ దుకాణం భవనంపై బోర్డ్‌ను అమర్చుతుండగా అది సర్వీస్‌ వైర్‌కు తాకింది. దీంతో బోర్డును పట్టుకున్న నవీన్‌ కుమార్‌ విద్యుత్‌ షాక్‌కు గురయ్యాడు. అతడిని తోటి కూలీలు మెదక్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో..

సంగారెడ్డి క్రైమ్‌: జిల్లా కేంద్రం ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర ద్వారం వద్ద అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్‌ కథనం ప్రకారం.. కొండాపూర్‌ మండలం తొగర్‌పల్లి గ్రామానికి చెందిన మంగళి భుజంగం(55) శనివారం సాయంత్రం ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర ద్వారం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వైద్యులు పరీక్షించగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని దుకాణాల వద్ద భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగించేవాడని పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి రిమాండ్‌


దేవయ్య

కొండపాక(గజ్వేల్‌): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడు దేవయ్యను రిమాండ్‌కు తరలించారు. త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌ ఆదివారం వివరాలు తెలిపారు. మండలంలోని ఖమ్మంపల్లి హైస్కూల్లో బయోలాజికల్‌ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దేవయ్య కొంత కాలంగా విద్యార్థినులను ప్రాక్టికల్స్‌ పేరిట ల్యాబ్‌కు తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిడంతోపాటు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ప్రతిఘటించిన విద్యార్థినులను పరీక్షల్లో ఫెయిల్‌ చేయిస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు హెచ్‌ఎంతోపాటు త్రీటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉపాధ్యాయుడు దేవయ్యపై పోక్సో కేసు నమోదవడంతో సస్పెండ్‌ చేశారు. ఈ నేపథ్యంలో దేవయ్యను కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

పూరి గుడిసె దగ్ధం

శివ్వంపేట(నర్సాపూర్‌): పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎర్రల్లో ప్రభాకర్‌ తన భార్యతో కలిసి పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. భార్యకు అనారోగ్యానికి గురికావడంతో తాళం వేసి, ఆస్పత్రికి వెళ్లారు. శనివారం అర్ధరాత్రి పూరి గుడిసెకు నిప్పంటుకుంది. గుర్తించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే గుడిసెలోని వస్తువులు అన్ని అగ్నికి అహుతైపోయాయి. గుడిసెలోని గ్యాస్‌ సిలిండర్‌ పేలడంతో భారీ శబ్దంతో కాలనీ వాసులు ఆందోళన చెందారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే తన గుడిసెకు నిప్పు పెట్టారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ప్రమాదంలో తులం బంగారు కమ్మలతో పాటు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, పట్టాదార్‌ పాస్‌ పుస్తకాలు కాలిపోయినట్లు చెప్పారు.

జామ తోట.. సిరుల పూదోట



పట్టుదల, కృషి ఉంటే అనుకున్నది సాధించవచ్చునని, విభిన్నంగా ఆలోచిస్తే అనేక ఆదాయ మార్గాలు ఉంటాయని నిరూపిస్తున్నారు చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లితండా గిరిజన రైతులు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని ఆధునిక పద్ధతుల్లో జామ తోటను సాగు చేస్తూ లాభాలను అర్జిస్తున్నారు. సుమారు వంద ఎకరాలకు పైగానే జామ తోటలు ఏర్పాటు చేశారు. కొందరు సొంతగా, మరి కొందరు ప్రభుత్వం కల్పించిన అవకాశం ఉపయోగించుకొని తోటల పెంపకం చేపట్టారు. పంట చేతికొచ్చాక వచ్చాక రైళ్లలో తిరుగుతూ విక్రయిస్తున్నారు. మరికొందరు పట్టణాల్లో అడ్డా మీద అమ్మకాలు చేస్తున్నారు. ఎవరిపైనా ఆధారపకుండా గిరిజనులకు వచ్చిన సరికొత్త ఆలోచన ఇప్పుడు ఊరంతా జామ తోటలకు నిలయంగా మారింది. చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

– చిన్నశంకరంపేట(మెదక్‌):

మిర్జాపల్లి గిరిజన తండా.. తోటలే నిండా

- అలహాబాద్‌ సఫేద, లక్నో 49 రకాలు పెంపకం
- ఒక్కసారే పెట్టుబడి
- ఏడాదిలో రెండు కాతలు
- విద్యావంతులు సైతం సాగులోకి..
- సికింద్రాబాద్‌ టూ నిజామాబాద్‌ రైళ్లలో అమ్మకాలు
- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఆదర్శంగా నిలుస్తున్న చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లితండా

ఎకరం పొలంలో 400 మొక్కలు

జామతోటల పెంపకంతో రైతులకు ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువగా వస్తుండటంతో గిరిజనులు జామ తోటల వైపు మక్కువ చూపారు. అలహాబాద్‌ సఫేదా, లక్నో 49, తైవాన్‌ రెడ్‌ రోస్‌ రకాల జామ మొక్కలను ఒక్కటి రూ.400 చొప్పున కొనుగోలు చేసి ఎకరం పొలంలో 400 మొక్కలు నాటుకున్నారు. వరి పంటను పోల్చుకుంటే జామతోట సాగుకు మొక్కలకు ఒక్కసారే పెట్టుబడి అవసరం అవుతుంది. నీరు కూడా తక్కువే. ఎకరం వరి సాగు చేసే నీటితో నాలుగు ఎకరాల జామ తోటకు నీరు అందించవచ్చు.

92 ఎకరాల్లో జామ తోటలు

మిర్జాపల్లి తండాలో 120 కుటుంబాలు. 460 మంది జనాభాతో ఉన్న చిన్న గిరిజన తండా. తండాలో 250 ఎకరాలు ఉండగా 228 మంది రైతులు ఉన్నారు. ఇందులో 92 ఎకరాల్లో జామ తోటలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. ఇతర సాగులో రకరకాల కూరగాయాలు, ఆకు కూరలు పండిస్తున్న ఆధునిక వ్యవసాయం వైపు అడగులు వేస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. తండాలో ఉన్నత విద్యావంతులు కూడా జామ తోటలను పెట్టి ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సికింద్రాబాద్‌ టూ నిజామాబాద్‌ రైళ్లలో..


జామపండ్లను బుట్టల్లో తీసుకొని రైలు కోసం ఎదురుచూస్తున్న మహిళలు

మిర్జాపల్లి గిరిజన తండా రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉంటుంది. దీంతో అక్కడి నుంచి వెళ్లే రైళ్లలో మహిళలు జామ పండ్లను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జామ తోటల పర్యవేక్షణను పురుషులు నిర్వహిస్తుండగా, పండ్లను విక్రయం బాధ్యతలు మహిళలు చేపట్టారు. మిర్జాపల్లి నుంచి ఉదయం సికింద్రాబాద్‌ వైపు వెళ్లే రైళ్లలో కొందరు.. నిజామాబాద్‌ వైపు వెళ్లే రైలులో మరికొందరు జామ పండ్లు విక్రయిస్తున్నారు. ఇదే సమయంలో చేగుంట, కామారెడ్డి, నిజామాబాద్‌, మెడ్చల్‌, సికింద్రాబాద్‌ సెంటర్‌లలో జామ పండ్లను విక్రయిస్తున్నారు. కిలో రూ.80 వరకు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. రోజుకు రూ.500 నుంచి రూ.3,000 వరకు ఆదాయం పొందుతున్నారు.

ఆరు నెలల్లో సుమారు రూ.1.50 లక్షల ఆదాయం



ప్రభుత్వం మొక్కల పెంపకం కోసం సబ్సిడీపై నిధులు అందించడంతోపాటు వందశాతం సబ్సిడీపై డ్రిప్‌ సిస్టమ్‌ అందిస్తుంది. పంట దిగుబడిలో ఆరు నెలలకు ఒక పంట చొప్పున ఏడాదిలో రెండు కాతలు వస్తాయి. పెట్టుబడి రూ.15 వేల ఖర్చు మాత్రమే వస్తుంది. జామ పండ్లను తోట వద్దనే విక్రయించడం ద్వారా ఆరు నెలల్లో సుమారు రూ.1.50 లక్షల ఆదాయం పొందవచ్చని గిరిజనులు చెబుతున్నారు. ఇదే జామపండ్లను సొంతగా విక్రయించుకోవడం ద్వారా ఆదాయం మరింత వస్తుందంటున్నారు. ఒక్కసారి జామతోట మొక్కలను నాటితే సుమారు 30 ఏళ్ల వరకు సీజన్‌లో రెండు సార్లు ఫలాలను అందిస్తుంది. తాము జామతోటను పెట్టి 12 ఏళ్లు అవుతుందని, ఇంకా 15 ఏళ్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫలాలు పొందనున్నట్లు రైతు మంగ్యా తెలిపారు.

నిజామాబాద్‌లో విక్రయిస్తాను



మూడెకరాల్లో జామ తోటను వేశాం.. మా భర్త బీమ్లానాయక్‌ పంట పర్యవేక్షణ చూస్తారు. నేను నిజామాబాద్‌లో పండ్లను విక్రయిస్తాను. కిలో రూ.80 వరకు అమ్మడం ద్వారా రోజు రూ.2 వేల వరకు ఆదాయం పొందుతున్నాను. తోటలోని జామ పండ్లను ఇతర విక్రయదారులకు అమ్మడం ద్వారా రోజువారి ఆదాయం వస్తుంది. ప్రతి రోజూ ఉదయం ఇంటర్‌ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో నిజామాబాద్‌ చేరుకొని అడ్డమీద జామపండ్లను విక్రయిస్తాను. సాయంత్రం ఇదే ట్రైన్‌లో ఇంటికి చేరుకుంటాను.

– లక్ష్మి, మిర్జాపల్లి తండా

పీహెచ్‌డీ చేశా.. జామ తోట వేశా



ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశా. అలాగే పీహెచ్‌డీ కూడా పూర్తి చేసి వ్యవసాయంపై దృష్టి సారించా. నాకున్న రెండు ఎకరాల్లో జామ తోటను పెట్టాను. ముందుగా ఎకరంలో 400 మొక్కలు నాటాను. మంచి లాభాలు ఆర్జించడంతో మరో ఎకరంలో 360 జామ మొక్కలను నాటాను. ఉన్నత చదువు చదివినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో జామ తోటను పెట్టడం ద్వారా రోజువారీ ఆదాయం పొందుతున్నాను.

– మోహన్‌ నాయక్‌, కామారం తండా

పదెకరాల వరకు తోటలు



మిర్జాపల్లి తండాలో ఒక్కొక్కరు అర ఎకరం నుంచి పది ఎకరాల వరకు జామ తోటలు ఏర్పాటు చేశారు. నేను జామ తోటను పర్యవేక్షిస్తూ ఇతర వ్యవసాయ పంటలు పండిస్తున్నాం. తమ ఇంట్లోని మహిళలు జామ పండ్లను సికింద్రాబాద్‌, నిజామాబాద్‌ పట్టణాల్లోకి తీసుకెళ్లి అమ్ముకొస్తున్నారు. ఒక రోజు కనీసం 3 వేల ఆదాయం వస్తుంది. మా కుటుంబ సభ్యులకు సరిపోనూ పండ్లు పోగా మిగితా పండ్లను ఇతరులకు కూడా విక్రయిస్తున్నాం.

– మంగ్యానాయక్‌, మిర్జాపల్లి తండా

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. బైక్‌ అదుపు తప్పి మూల మలుపు వద్ద డివైడర్‌ను ఢీకొని ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మేడిపల్లి శివారులో రాజీవ్‌రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చత్తీస్‌గడ్‌ రాష్ట్రానికి చెందిన ఉల్లేష్‌ కుమార్‌(37), విష్ణు(35) మల్లారం శివారులోని రామాంజనేయ క్రషర్‌లో కూలీపనులు చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వారిద్దరు బైక్‌పై సిద్దిపేటకు వచ్చి సరుకులు కొనుగోలు చేసుకుని తిరిగి బయల్దేరారు. మేడిపల్లి క్రాసింగ్‌ సమీపంలోని మూలమలుపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృత దేహాలను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కూలీ

డివైడర్‌ను ఢీకొని..

కొండపాక(గజ్వేల్‌): బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని సిర్సనగండ్ల శివారులో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట వైపు నుంచి ద్విచక్ర వాహనంపై గ్రామానికి చెందిన దేవిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి (22) తొగుట మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి సిర్సనగండ్ల గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఉదయ్‌ కుమార్‌రెడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు.

ఐసీఐసీఐ బ్యాంకులో షార్ట్‌ సర్క్యూట్‌

గజ్వేల్‌రూరల్‌: ఐసీఐసీఐ బ్యాంకులో షార్ట్‌ సర్క్యూట్‌తో పొగలు వ్యాపించాయి. ఈ ఘటన ఆదివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తూప్రాన్‌రోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకు నుంచి పొగలు అలముకున్నాయి. దీంతో స్థానికులు ఫైర్‌స్టేషన్‌, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు బ్యాంకు తలుపులను తెరిచి పొగలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు

నష్టపరిహారం ఇవ్వాలని నిరసన

బెజ్జంకి(సిద్దిపేట): కలుషిత నీటిలో మృతి చెందిన చేపలకుగాను మత్స్యకారులకు నష్ట పరిహారం ఇవ్వాలని మండలంలోని గాగిళ్లాపూర్‌, గుగ్గిల్ల గ్రామాల ముదిరాజ్‌లు ఆదివారం గ్రామ శివారులోని ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కలుషితనీరు మొత్కుల కుంటలోకి చేరడం వల్లే చేపలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్వో ప్లాంట్‌ తనిఖీ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని హెటిరో పరిశ్రమ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ పనిచేయకపోవడంతో గ్రామస్తులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. దీంతో హెటిరో పరిశ్రమ యాజమాన్యం ఆదివారం ప్లాంట్‌ను తనిఖీ చేశారు. త్వరలో మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తామని పరిశ్రమ హెచ్‌ఆర్‌ భాస్కర్‌ రెడ్డి తెలిపారు.

కార్మికుల సంక్షేమం సీఐటీయూకే సాధ్యం


సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు

సీఐటీయూలో చేరిన నాయకులు

పటాన్‌చెరు టౌన్‌: కార్మికుల కష్ట సుఖాలు సీఐటీయూకే తెలుసని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, యూనియన్‌ అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక్‌భవన్‌లో ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్‌ కార్మిక సంఘాల నుంచి పలువురు కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా చుక్కారాములు మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన నిలబడుతూ వారి యోగ క్షేమాల్లో సీఐటీయూ పాలు పంచుకుంటుందన్నారు. సీఐటీయూ ఉన్నచోట మాత్రమే కార్మికులకు న్యాయం జరుగుతుందని కార్మికుల్లో ప్రగాఢ నమ్మకం ఉందన్నారు. జిల్లాల్లో పలు పరిశ్రమల్లో చారిత్రత్మాక వేతన ఒప్పందాలు చేసిన చరిత్ర సీఐటీయూకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజయ్య, వజిద్‌అలీ, యూనియన్‌, జనరల్‌ సెక్రటరీ వీఎస్‌ రాజు, యూనియన్‌ నాయకులు తలారి శ్రీనివాస్‌, నాగప్రసాద్‌, బిలాల్‌, మహేశ్వర్‌రెడ్డి, సోమన్న పాల్గొన్నారు.

తక్షణం ఫీజు బకాయిలు చెల్లించండి



పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్‌

సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌

సంగారెడ్డి: పెండింగ్‌ ఫీజు రియింబర్స్‌మెంట్‌ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌ మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాలుగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల స్కాలర్షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వాలు వ్యవహరించిన తీరును కాంగ్రెస్‌ ప్రభుత్వం అనుసరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన పెండింగ్‌ ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే బకాయిల మొత్తాన్ని చెల్లించి విద్యార్థుల భవిష్యత్తులను కాపాడాలని కోరారు. లేని యెడల జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్‌ జిల్లా నాయకులు సిద్ధు, అనిల్‌, దినేష్‌, శ్రీకాంత్‌, బన్నీ, నర్సింలు, సాయి కృష్ణ. వంశీ పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీకి యత్నం

ప్రతిఘటించిన మహిళ.. దుండగుల పరారీ

మనోహరాబాద్‌(తూప్రాన్‌): జామకాయలు విక్రయిస్తున్న మహిళ మెడలోంచి దుండగులు పుస్తెల తాడును చోరీకి విఫలయత్నం చేశారు. మనోహరాబాద్‌ మండలం కూచారం తండాకు చెందిన మాలోత్‌ లత జామకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని కాళ్లకల్‌ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద జామకాయలు అమ్ముతుండగా ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి జామకాయలు కొన్నట్లు నటించారు. ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును తెంపె ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించింది. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పుస్తెలతాడు చోరీకి యత్నించిన దుండగులు

శ్రీశైలం తరలిన శివస్వాములు



జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం శివసన్నిదాన స్వాములు శ్రీశైలం బయలుదేరారు. 41 రోజు నియమనిష్ఠలతో శివనామాన్ని స్మరిస్తూ అభిషేకాలు నిత్యపూజలతో మండల దీక్ష పూర్తి చేసుకున్నారు. ఆదివారం సురేందర్‌ గౌడ్‌ గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 50 మంది శివస్వాములు ఇరుముడితో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం భ్రమరాంబ మల్లికార్జున దర్శనానికి పయనమయ్యారు. శివనామస్మరణతో మాదారం మార్మోగింది. ఈ సందర్భంగా సురేందర్‌గౌడ్‌ గురుస్వామి మాట్లాడుతూ.. శివ దీక్షలతో మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు పరమ శివుని దీవెనలు పొందుతారని అన్నారు. శ్రీశైలం మల్లికార్జున స్వామికి ఇరుముడి మొక్కులను చెల్లించి తిరుగు ప్రయాణం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివస్వాములు మల్లేశ్‌, గణేశ్‌, బల్బీర్‌ సింగ్‌, వీరేశ్‌గౌడ్‌, భవాని సింగ్‌, శ్రీనివాస్‌ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తీరని సొంతింటి కల

- 'డబుల్‌' ఇళ్ల పంపిణీకి ఇంకెన్నాళ్లు..?
- పట్టాలు పంపిణీ చేసినా.. కేటాయింపులో జాప్యం
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు


హోతి(కె) వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్‌బెడ్‌ రూం ఇళ్లు

జహీరాబాద్‌ టౌన్‌: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపట్టిన డబుల్‌బెడ్‌ రూం ఇళ్ల పథకం అస్తవ్యస్తంగా తయారైంది. నిర్మాణం పనులు ప్రారంభించి ఆరేళ్లవుతున్నా.. ఇంకా పనులు చేయాల్సి ఉంది. పట్టాలిచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇళ్లను అప్పగించకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు. పట్టాలు పొందిన వారికి ఇళ్లను కేటాయిస్తారా లేదా అనుమానం లబ్ధిదారుల్లో కల్గుతోంది.

గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం గూడులేని నిరుపేదలకు కోసం డబుల్‌బెడ్‌ రూం ఇళ్ల పథకాన్ని చేపట్టింది. ఈ మేరకు జహీరాబాద్‌ మున్సిపల్‌ పరిధిలోని హోతి(కె) వద్ద 660 డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ. 5.04 లక్షల చొప్పున రూ.36కోట్లు మంజూరు చేశారు. మూడంతస్తుల బ్లాక్‌గా వీటిని నిర్మిస్తున్నారు. ప్రారంభం నుంచి నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్‌ పనులు మధ్యలోనే వదిలేయడంతో నిర్మాణం పనులు అక్కడే ఆగిపోయాయి. రెండేళ్ల క్రితం మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు అప్పటి కలెక్టర్‌ శరత్‌ సమీక్షించి.. మిగులు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్‌ హెల్త్‌ డిపార్టుమెంట్‌ అధికారులు కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే.. కాంట్రాక్టర్‌ మారిన తర్వాత కూడా పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ఇంకా చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి.

లబ్ధిదారుల ఎంపిక చేసినా.. కేటాయింపుల్లేవ్‌

అసెంబ్లీ ఎన్నికలకు ముందు డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేసి జాబితాను సిద్ధం చేశారు. లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు ఇళ్ల సర్టిఫికెట్లను కూడా పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఎంపిక జరిగి ఏడాదిన్నర గడుస్తున్నా ఇళ్లను అప్పగించకపోవడంతో వారంత ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మారడంతో ఇళ్ల కేటాయింపుపై ఆందోళన చెందుతున్నారు. మిగులు పనులు పూర్తి చేసి ఇళ్లను వెంటనే ఇళ్లను అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.